చిరంజీవి మరుపు

(కథానిక)

బయలు దేరేటప్పుడే అనుకున్నాడు చిరంజీవి తను ఏదో వస్తువు మరిచిపోయానని. చిరంజీవికి యిది అలవాటే. ఏదయినా ప్రయాణం పెట్టుకున్నప్పుడు ఏదో ఒక అవసరమయిన వస్తువు మరిచిపోతూ వుంటాడు. అందులోనూ యిది మామూలు ప్రయాణం కాదాయె వెళ్లేది అత్తవారింటికి.

తను ఏదో వస్తువు మరిచిపోయాడని గట్టిగా నమ్మాడు చిరంజీవి. కాని ఆ మరిచిపోయిన వస్తువేమిటో యెంత ఆలోచించినా తేలలేదు. ఒకసారి కట్టిన బెడ్డింగ్‌ని అంతా విప్పదీసి పరిశోధన చేశాడు. హెయిర్ ఆయిలు, ఫేస్ పౌడరు, కళ్ళకి కూలింగ్ గ్లాసెస్ అన్నీ చెక్కు చెదరకుండా వున్నాయి. తను తరుచుగా మరిచిపోతూవుండే టూత్ పేస్టుకూడ వున్నది. ఐతే తను మరిచిపోయిందేమిటి?

ఆలోచనలతో అంతుపట్టక అలాగే బయలుదేరాడు చిరంజీవి. ఒకవేళ మనీపర్సుగాని మరిచిపోలేదుగదా! జేబు చూసుకున్నాడు. భద్రంగా వున్నది. చేతి రిస్టువాచి కనిపిస్తూనే వుంది. పోనీలే అనుకుని తలిదండ్రులదగ్గర సెలవు తీసుకుని రైలెక్కాడు. వెధవది రైల్లోకూడా ఇదే ఆలోచన. తను ఏదో మరిచిపోయాడు. అది ఏదో తెలియకపోయినా తప్పక తన కొంప ముంచుతుంది. ఒకసారిలాగే పెళ్ళికి వెళ్తూ టవల్ తీసుకువెళ్ళటం మరిచిపోయాడు. ఆ పెళ్ళి హడావుడిలో తన గొడవ యెవరు చూస్తారు? స్నేహితుడిని బ్రతిమాలి అప్పటికి తన అవసరం గడుపుకున్నాడు. అన్నట్టు తను తువ్వాలు తీసుకువెళ్తున్నాడా? దాన్ని జాగ్రత్తగా బట్టలతోపాటు పెట్టినట్లు చిరంజీవికి గుర్తు వచ్చింది. ఈ ఆలోచనలలోనుండి బయటపడదామని యెంత కొట్టుకుంటున్నా మనస్సు మళ్లీ దానిమీదికే పోతున్నది.

ఆలోచనల్లోనే అత్తవారి వూరు చేరాడు. స్టేషన్‌కి తనకోసం ఎవరయినా రావాలి. సామాను ప్లాటుఫారంలో దింపుకుని అంతా పరకాయించి చూశాడు. ఎవరూ రాలేదు తన కోసం. చిరంజీవికి కొంచెం మండింది. కాని తను యిక్కడికి ఎన్నిసార్లు వచ్చాడు? చాలాసార్లు. అందుకే ఎవరూ రాలేదు. ఎవరయినా ఎన్నిసార్లు వస్తారు? మొదట్లో వస్తారు అల్లుడిని ఆహ్వానించటానికి. తర్వాత ఆ అలవాటు మారిపోతుంది.

చిరంజీవి యిలా సమాధానపడి అత్తవారిల్లు చేరాడు. తనను గుమ్మంలోనే చూచిన మరదలు పిల్ల లోపలికి తుర్రుమంది. బండివాడికి డబ్బులిచ్చి పంపేసి లోపలికి అడుగువేశాడు.

“ఏమోయి, కులాసాగా వున్నావా?” అత్తగారు అడుగుతూంది.

చిరంజీవి ఏదో ముక్తసరిగా సమాధానం చెప్పాడు.

“కాళ్లు కడుక్కో, అదేమిటి? ఇంకా నీళ్ళివ్వలేదూ, అమ్మాయి వసూ బావకి నీళ్లు తెచ్చి యియ్యమ్మా” అని కేకవేసింది ఆవిడ. మరదలు వసంత నీళ్లు తెచ్చియిచ్చింది. చిరంజీవి తను వేసుకున్న బెల్టు బూట్లు విప్పేసి కాళ్లు కడుక్కొని గదిలోకి పోయాడు.

పన్నెండింటికి మామగారు వచ్చాడు. అప్పటిదాకా చిరంజీవి భోజనం చేయకుండా ఆయనకోసం కనిపెట్టుకు కూర్చున్నాడు. మధ్యాహ్నం భోజనాలు అయినాయి. చిరంజీవికి నిద్ర తూలుకువస్తున్నది. తన గదిలోకిపోయి ప్రక్కమీద పడుకున్నాడు. హాయిగా నిద్ర పట్టింది.

మూడింటికిగాని మెలకువరాలేదు చిరంజీవికి. లేచి అటూయిటూ దొర్లాడు. తను మరిచిపోయిన వస్తువుగురించి ఆలోచన్లు రాసాగాయి. విసుగుపుట్టి వాటిని బలవంతంగా దూరానికి తోసేశాడు. చిరంజీవికి ఎందుకో కొంచెం

కొమ్మూరి వేణుగోపాలరావు

చిరాకు కల్గింది అంతే. ఇక్కడికి వచ్చేవరకే ఆ తహతహ. తీరా వచ్చింతర్వాత స్వంత యింట్లో వున్న హాయి మరెక్కడా వుండదు! అతనికి చాలా సార్లు యిలాగే ఐంది. వెళ్ళేదాకా వుబలాటం, తర్వాత విసుగు. మళ్ళీ ఆక్కడినుంచి వచ్చేసింతర్వాత యెందుకొచ్చేశామా అని విచారం. చిరంజీవికి యింకా ఆమె కనిపించలేదు. మొదట్లో మాట్లాడటానికి భిడియపడేవాడు. కాని తన స్నేహితుడు గోపాలం అతని భార్యతో అత్తగారి ముందే నిర్భయంగా మాట్లాడతాడని తెలిసేటప్పటికి తనుకూడా మాట్లాడడం నేర్చుకున్నాడు. అంత అమర్యాదగా అత్తగారి ముందు మాట్లాడకపోయినా యెప్పుడో వీలు చూసుకుని పలకరిస్తూ వుండేవాడు.

చిరంజీవి యిక్కడికి వచ్చినతర్వాత ఇంకా ఆవిడగారు ముఖం చూపించలేదు. చివరికి ఏమి తోచక ప్రక్కన కిటికీలో పడేసి వున్న ప్లేయింగుబాక్సు తీసి దానితో కుస్తీ పట్టసాగాడు.

గది అవతల గాజులు గలగలమన్నయ్. చిరంజీవి వులిక్కిపడి ద్వారంవేపు చూడసాగాడు. శారద వెండి పళ్ళెంలో ఫలహారం, మంచినీళ్ళ గ్లాసు పట్టుకువచ్చి అతని ముందు పెట్టి తలవంచుకుని నిలబడింది.

“అబ్బో చాలా చేశారే. అయినా పొద్దున్ననగా వస్తే యింతవరకూ రాణిగారి దర్శనం లేదన్నమాట” అన్నాడు తన చలాకీతనానికి తనే గర్వపడుతూ.

శారద మాట్లాడలేదు. కనీసం ఏమి మాట్లాడాలో కూడా తోచలేదు.

“కులాసాగా వుంటున్నావా?” మైసూరుపాకు రుచి చూస్తూ అన్నాడు.

“ఊఁ”

“ఏం, పలికితే ముత్యాలు రాలిపోతాయా ఏమిటి? మొన్న వుత్తరం రాస్తే జవాబు కూడ రాశారు కాదేమండీ?” అతనిలో చలాకీతనం హెచ్చసాగింది.

“ఎందుకు? యెలాగూ వస్తున్నారుగా!”

“సరేలే. చదువుకుంటున్నావా బాగా?”

శారద స్కూల్ ఫైనల్ చదువుతూంది.

“ఆఁ”

చిరంజీవికి యింకేం మాట్లాడాలో తోచక పళ్ళెం ఖాళీ చేయసాగాడు. అతను మొదట్లో సిగ్గుపడేవాడు గాని యిప్పుడు పెట్టిందంతా తినటం నేర్చుకున్నాడు.

“కాఫీ తీసుకువస్తా” అంటూ శారద లోపలికి వెళ్ళిపోయింది.

చిరంజీవి యీలోగా పళ్ళెం ఖాళీ చేసేసి యిన్ని మంచినీళ్లు త్రాగేశాడు. అతనికి ఛటుక్కున తట్టింది. శారద చిక్కిపోయింది. అవును ఆమె బాగా చిక్కిపోయింది.

శారద కాఫీ తీసుకువచ్చింది. చిరంజీవి గ్లాసు అందుకుని “ఇలా చిక్కిపోయావేం శారూ!” అని అడిగాడు.

ఈ విధంగా పిలవటం యీ మధ్యనే నేర్చుకున్నాడు యెందులోనో చదివి. ఆమె కొంచెం నవ్వి వూరుకుంది.

“రాత్రిళ్లు చదువుతున్నావా?”

“ఊఁ”

చిరంజీవి అదిరిపడ్డాడు. ఆవిడ రాత్రిళ్లు చదివి ఆరోగ్యం పాడుచేసుకుంది. తను ఇప్పుడు బి.ఎస్.సి. చదువుతున్నా రాత్రి పదింటికన్నా యెక్కువగా మేలుకోలేదు. సెకండు షో సినిమాకి కూడా వెళ్ళి యెరుగడు.

“ఛా. అదేమిటి పరీక్షలు యింకా నాలుగు నెలలున్నాయి. అంత కష్టపడి చదవట మెందుకూ” అన్నాడు.

శారద ఏంమాట్లాడలేదు. కాని ఏదో అడుగుదామని యిందాకటినుంచీ ప్రయత్నం చేస్తోంది. “నాకు పండక్కి ఏం తెచ్చారు?”

చిరంజీవి “చాలా మంచిదే తెచ్చా” అందామనుకుని ఒక్కసారిగా తృళ్ళిపడ్డాడు. తను ఒక వస్తువు మరిచిపోయాడు, ఎంత ఆలోచించినా అదేమిటో తెలియలేదు. కాని అదేమిటి? “క్రొత్తచీర” యిప్పుడు తెలిసింది. తను ఆ బెడ్డింగ్‌లో చుట్టబెట్టినట్లు గుర్తు. కాని వుదయం అదంతా తీసి వెతికినప్పుడు కనిపించలేదు. బహుశా అది అలమార్గాలోనే పెట్టి మరిచిపోయి వుండాలి. తను యెంత తెలివి తక్కువ పని చేశాడు!

చిరంజీవి తెల్లమొహం వేయటం కనిపెట్టి శారద తెల్లబోయి చూడసాగింది.

"అరె. మరిచిపోయాను శారూ" అన్నాడు చివరికి. శారద ముఖం వాడిపోయింది. చెక్కిళ్లు ఎర్రబడ్డాయి.

"అదికాదు శారూ! అది కొని తీసుకు రావటం మరిచిపోయాను. నువ్వు క్రిందటిసారి అడిగినటువంటి చీరే కొన్నాను" అన్నాడు అదేమాదిరిగా.

కాని శారద ఎలా నమ్ముతుంది? అది మరిచిపోవటానికి ఏమైనా పెన్నా? పెన్సిలా? తన భర్త డబ్బు ఖర్చయి పోతుందనో, యిష్టం లేకనో తీసుకురాలేదు.

"కోపం వచ్చిందా శారూ!"

శారద గిరుక్కుమని తిరిగి వెళ్ళిపోయింది. చిరంజీవి తెల్లబోయాడు. నిజానికి ఆమెకు కోపం రావటంలో తప్పేమీ లేదు. క్రిందటి సారి గూడా తనేమీ తీసుకురాలేదు. చిరంజీవికి తనమీద తనకే కోపం వచ్చింది. తను అది ఎందుకు మరిచిపోవాలి? పోనీ అతని అలవాటు ప్రకారం మరిచిపోయాడు, తనకంత విఘాతం కలిగించే క్రొత్తచీర మరిచిపోవలసి వచ్చిందే? ఏ ఫేస్ పౌడరో ఎందుకు మరిచిపోకూడదు?

చిరంజీవి ఆ చీరను ముప్ఫయి అయిదు రూపాయలు వెచ్చించి తీసుకొన్నాడు అయితే ఏంలాభం? శారద కోపానికి గురికాకుండా తప్పించుకోలేక పోయాడు.

చిరంజీవి లేచి తల దువ్వుకోసాగాడు. వసంత వచ్చి "మొహం కడుక్కో బావా. నీళ్లు పెట్టాను" అన్నది. నిజానికి ఆమాట శారద అనవలసింది.

చిరంజీవి వెళ్ళి ముఖం కడుక్కు వచ్చాడు. ఏదన్నా సినిమాకి వెళ్ళదామనుకున్నా బుద్ధి పుట్టలేదు. సరే నాలుగు వీధులూ అలా తిరిగి వద్దామని బట్టలు వేసుకుని బయలుదేరాడు.

అతను మళ్లీ యింటికి వచ్చేటప్పటికి ఏడున్నరయింది. మామగారు వాకిట్లో కూర్చుని చుట్ట కాల్చుకుంటున్నారు. ఆయన మనిషి నవనాగరికుడయినా యిదో దురలవాటు.

"ఎక్కడికి పోయావోయ్?" గుప్పున పొగ వదుల్తూ అడిగాడు.

"ఊం ఊరికినే అలా తిరిగి వచ్చానండి" అని చెప్పి గదిలోకి వెళ్ళాడు. వెళ్ళి బట్టలు మార్చుకునేటప్పటికి మరదలు పిల్ల వచ్చి "అన్నం వడ్డించారు. రా బావా!" అన్నది. చిరంజీవికి కొంచెం చిరాకు కలిగింది. "మాటి మాటికి యీ పిల్ల వచ్చి అడగటమేమిటి. శారద రారాదూ?" అనుకున్నాడు.

భోజనాలదగ్గర మామగారు ఏమేమిటో చెప్పుకు పోతున్నాడు. ఆయన మాట్లాడే దాంట్లో ఎన్నికల దగ్గర్నుంచీ కొరియా యుద్ధం వరకు అన్ని సంగతులూ దొర్లిపోతున్నయి. అసలు చిరంజీవి యిలాటి విషయాల్లో ప్రతి దాన్నీ ఖండించి వాదించే స్వభావం. కాని యివాళ మనసు బాగా లేకపోవటంవల్ల కిమ్మనకుండా వూరుకున్నాడు. ఎదుటివాడు మాట్లాడకుండా వూరుకుంటే ఆయన యెంతసేపని వాగుతాడు? నోరు నొప్పెట్టి కొంతసేపటికి ఆయన కూడా వూరుకున్నాడు.

భోజనమయింతర్వాత చెయ్యి కడుక్కునేందుకు పెరట్లోకి వెళ్ళాడు చిరంజీవి. అప్పుడే శారద బావిదగ్గర్నుంచి లోపలికి వస్తున్నది. ఎవ్వరూ లేకపోవటం కనిపెట్టి "ఆగు శారూ!" అన్నాడు.

ఆమె ఆగిపోయింది.

తను ముప్ఫయి అయిదు రూపాయిలు పెట్టి నిజంగా చీర కొన్నాడనీ, పొరపాటు చేత తేలేదనీ, అందులో అతని తప్పు ఎక్కువలేదనీ నచ్చచెప్పదామనుకున్నాడు.

"అది కాదు శారూ!..."

ఏది కాదు? అతను మొదలు పెట్టేసరికే శారదలోపలికి వెళ్ళిపోయింది. చిరంజీవి తెల్లపోయాడు. యింకా అతనికి కోపం రాలేదు. పాపం శారద అమాయకురాలు అని జాలిపడి చెయ్యి కడుక్కుని లోపలికి వెళ్ళిపోయాడు.

అంతే. మరునాటి వుదయం శారద కనిపించనేలేదు. ఏపని కావలసి వచ్చినా మరదలు పిల్ల తైతక్కలాడుతూ తయారయ్యేది. చిరంజీవికి చెడ్డ విసుగు కలిగేది.

ఆ రోజు మధ్యాహ్నం వసంత కాఫీ తెచ్చినప్పుడు "మీ అక్కయ్య తెచ్చియియ్యలేదా?" అని అడిగాడు.

"ఏమో. యివ్వనంది" అందిమూతి తిప్పుతూ ఆ పిల్ల.

"అలాగా? ఏం?"

"కోపం వచ్చింది కాబోలు. నాకేం తెలుసు. అన్నీ నన్నే యిచ్చి రమ్మంది."

"ఆవిడగారికి ఏమొచ్చిందేమిటి? నీతో ఏమయినా చెప్పిందా?" అని అడిగాడు శాంతంగానే.

"ఏమో బావా. నాతోం ఏం చెప్పలేదు" అని వెళ్ళిపోయింది.

"సరే" అనుకున్నాడు చిరంజీవి. అతనికిప్పుడు బాగా మండింది. తను ఎవరికోసం వచ్చాడిక్కడికి. మరదలు పిల్లతో సరసాలాడటానికా? అత్త మామలతో కబుర్లు చెప్పటానికా? మరి అటువంటిది ఎందుకీ కోపతాపాలు? నిజంగా చిరంజీవికి యిక్కడనుంచి వెళ్లిపోవాలని బుద్ధి పుట్టింది. కాని మామగారేమనుకుంటారో అనే భయంచేత మరో రెండు రోజులు గడప దలిచాడు.

అయినా చిరంజీవికి యింకా ఆశ పూర్తిగా చావలేదు. ఒకవేళ చీరఏమయినా బెడ్డింగులో వుండేమోనని మళ్ళీ యింకోసారి వెదికాడు. అది వుంటేగా!

చిరంజీవి ఎలా అయితేనేం మరో మూడు రోజులు నెట్టుకొచ్చాడు. నెట్టుకొచ్చాడే గాని దిగులుగానే గడిపాడు. సరదాగా గడుపుదామని వస్తే యిలాగయితే దిగులెందుకు వుండదు.

ఆరోజు భోజనాలు చేస్తుండగా యీ విషయం యెత్తాడు. మామగారు తెల్లబోయి "అదేమిటోయ్. నువ్వు వచ్చి నాలుగు రోజులే కదోయి. మరో నాలుగు రోజులు వుండవచ్చు" అన్నాడు.

"అక్కర్లేదండి. పరీక్షలు దగ్గర కొస్తున్నాయి. చదువుకోవాలి" అన్నాడు.

"అదేమిటి నాయనా? పెద్దపండుగ నిన్నే గదా అయింది. అప్పుడేనా?" అంది.

"చదువుకోవాలండీ. కష్టం" అని మెల్లిగా నసిగాడు చిరంజీవి.

మామగారు, అత్తగారు చేతనయినంతవరకూ బ్రతిమిలాడారు. పాపం వాళ్ళకి యీ తగాదా విషయం తెలియదు. వాళ్లు యెంత చెప్పినా చిరంజీవి అంగీకరించక ఆ సాయంత్రం ప్రయాణమై వెళ్ళటానికే నిశ్చయించుకున్నాడు.

ఈ సంభాషణ అంతా వింటున్న శారద చలించలేదు. పోతేపోనియ్యి అనుకుంది. ఆమెకు నిజంగా అంత కోపంగా వుంది భర్తమీద. సావిత్రి భర్త ఆమెకి లిప్టువాచి కొనిచ్చాడు. చక్కగా వుంది. ఆమె అతి గర్వంగా చూపిస్తుంటే తనకెంత చిన్నతనం వేసింది?

ఆ సాయంత్రం చిరంజీవి ప్రయాణం కట్టాడు. అప్పుడు ఒకవేళ శారద వచ్చి పలకరించినా పలుకకూడ దనుకున్నాడు. మామగారు స్టేషన్ దాకా వచ్చి దిగబెట్టి వెళ్ళాడు. చిరంజీవికి మండిపోయింది. ఆఖరికి వెళ్ళిపోతున్నప్పుడన్నా వచ్చి మాట్లాడించలేదని తెగని కోపంగా వుంది.

చిరంజీవి బండిలోంచి దిగంగానే తండ్రి ఆశ్చర్యపోయి "అదేమిట్రా అప్పుడే వచ్చేశావు" అని అడిగాడు.

"వంట్లో బాగుండలేదు నాన్నా" అని గొణిగాడు చిరంజీవి.

ఇంట్లో ప్రవేశించంగానే అందరూ అలానే ప్రశ్నించేసరికి చిరంజీవికి చిరాకు కల్గింది. గట్టిగా కసరుకుని గబగబ గదిలోకి పోయాడు. అలమారా తలుపులు తీసే వున్నాయి. కాని అందులో చీర మాత్రం కనిపించలేదు. చిరంజీవి విస్తుపోయాడు. అతనికి చటుక్కున ఒక విషయం గుర్తుకు వచ్చింది. ఒకవేళ తన చెల్లెలు తీసిందేమో. దానికెప్పుడూ యివే పనులు. వెంటనే చెల్లెల్ని పిలిచాడు.

జానకి వచ్చింది "ఎందుకన్నయ్యా పిలిచావు" అంటూ.

"అవునుగాని యీ అలమారాలో చీర పెట్టాను. నువ్వుగాని తీశావా?" అని అడిగాడు.

"నాకేం తెలుసు? అసలు చీరేమిటి?" అని అడిగింది జానకి.

"సరేలే. అవతలకినడు" అని కసురుకున్నాడు.

మరునాడు ఆ బెడ్డింగంతా సర్దుకుంటున్నాడు చిరంజీవి. పరుపు అడుగునుంచి ఏదో తళుక్కుమని తొంగిచూసింది. కోపంతో బయటికి లాగి చూశాడు. తను భార్యకోసం ముప్పై అయిదురూపాయిలు పెట్టి కొన్న చీర. తనతో కూడా అత్తవారింటికి వెళ్లి మళ్ళీ తనతోనే వచ్చేసింది.